# చీకటి మనుషులు

పద్దినాలు సలిజరంతో మెల్దిరిగిపోయిన యానాది ఎ(రాయి, నిన్నా మొన్నా కాత్తె సుమారు గుంటాన యానాది గుడిసెల ముంగల రాత్తా పక్కన సింసెట్టు కింద కాత్తెకూత్తె ఎండ తగిలీ తగలక, ఎచ్చెచ్చగా, సల్లసల్లగా-పైపంచ మొగం, సెవులు బయటికుండేట్టు కప్పుకుని, వొత్తా పోతా వుండే జనాన్ని సూత్తా కూకుండాడు.

కాత్తె సుట్టపాయకో, ఏలెడి బీడిముక్కకో మద్దె మద్దె అలవాటుపడ్డ పానానికి పద్దినాలు సల్జెరం గిల్జెరవంటూ వొచ్చి పడేతలికి కుతి ఎంత లెక్కకు లెగిసేదీ అట్టుంచి, యీ పద్దినాలూ కాలూసెయి ఆడక- దొరికితే గిరికితే- ఆ నాలుగు గింజలూ ఎనిక్కి బోయేతలికి ఆ కాక యీ కాక సేరి నిక్కాక బుట్టిన మదుసుల యవారం బెమ్మదేవుణ్ని పుట్టిచ్చి నోరికి తెలవాల్సిందేగాని సిప్పకదుపు ఎ(రాయికీ, ఎ(రాయిని సూత్తా కూకుండ పెల్లాం ఈరావుఁకూ తెలిసొచ్చేదేం లేదన్నమాట.

అంతలెక్క వూపిరి పీక్కుంటా అటనే కూకుని- సె(క్రం దిరిగినట్టు యిట్ట ఎ(రాయి సూరయ్య బెల్లంగడ్డ కల్లి సూసేతలికి సూరయ్యతో బెల్లంగెడ్డా, అయిదారుగురు పిల్లల్తో కోడిపెట్టా, బ(రెపడ్డ, బొనికతో సుండోళ్ళ కుక్కపిల్లా ఎటుగా ఎగిరెల్లిందీ ఎ(రాయికే అంతుబట్టలా.

"ఏం యాన్దొరా?"

ఎంటనే తెప్పరిల్లుకుని సూపు గిరిజూసుకుని సూసేతలికి ఎ(రగెళ్ళ లుంగీగుడ్డా, నల్లెంటికల బిరుసుగడ్డం ఆడ్తా అగుపించినై ఎ(రాయికి.

మరెందుకనో తెలవదుగాని ఆ నల్లగెడ్డాన్ని ఎప్పుడు తలుసుకుండా మొగమ్మీన కొచ్చి కూకుని రుద్దుతావుంటున్నట్టనిపిచ్చుద్ది ఎ(రాయికి.

"సలాం మొతాచ్చాయిబయ్యా" అన్నాడు ఎ(రాయి.

"ఈ దొంగసలావుఁలు మాఖాద హెందుకులేవోయ్! ఎక్డా కనుపించటం లేదు గిరాకేవఁన్నా తగిలిందేంటీ?"

"గిరాకేం దయ్యోవ్ చాయిబ్బయ్యా!"

"పగల్ కనుపించ్కాబోతే హడిగాన్లేవోయ్".

"సల్జెరందగిలి గుడిసిలోనే పొందుకుంటినిగా-"

"వా! యీ ఏడు సెర్వ్వాపాట ఆరొందలేభయికీ పైసల్ హయిందీ తెల్సుగా? అయినా సెర్వ్వా గిర్వ్వా మీకీ మాకీ దేన్కీ షెప్పు-అరే సొబ్బీహైసా, హైసా భోడ్ జాతా - జతా - వా!" టపటప లుంగీగుడ్డ కొట్టుకుంటూ ఎల్లిపొయ్యాడు మొతాచ్చాయిబు.

"తల్మొండవెయ్యం!... ఆరొందలయాభై కాడికి పాట లెగవదీసి సెరువులాగేసుకుండా రన్నమాట. ఆ వాసన అప్పుడే తగిలిందిలే యిగదేనికి-" "యిదిగో కాత్తె సుట్టపాయుంటే పారేసెల్లు దొరా!" అనడిగాడు ఎర్రాయి అటుగా బోతుండ రాగవయ్యను జూసి.

"ఇదిగో - ఆడకేబోతుండా-" అంటానే అంగలేసుకుంటా ఎల్లిన రాగవయ్య మొదులు ఏమంటా బోయిందీ అంతుబట్టలా ఎర్రాయికి.

నాగయ్య వొత్తావుంటం జూసి సేతులు కాళీగ వొదిలి కూకుండాడు ఎర్రాయి. నాగయ్యకు గూడెంలో గుడిసెల్లోగాని బీడీ ముట్టిచ్చుకోను నుప్పుదొరకదని ఎర్రాయికి తెల్చు.

"ఓ ఏవిండోయ్-" అంటున్నాడు ఎర్రాయి.

"ఇదిగో నాగరత్తమ్మ గుడిసెలో వుందట్రా ఎర్రాయ్ - కాత్తె పనుండదిగాని వుండదంట్రా ఎర్రాయి. రైట్-" గబగబమన్నాడు నాగయ్య ఎళ్తూనే.

"బీడిముక్కుంటే పారెయ్యండి-"

"వుండు - వుండదా - రైట్ - వత్తానుండు-" అంటా ఎల్లిపోయిన నాగయ్యకు నాగరత్తమ్మ గుడిసెలో తొందర పన్లుండయ్యనుకుండాడు ఎర్రాయి.

ఇప్పటికి ఎక్కిన ఏడి సాలనుకుంటా లెగిసి గబగబ గుడిసెలోకొచ్చాడు ఎర్రాయి.

"ఏందయ్యా సూరుకల్లి నువు సూసేదీ?" అంది సూరుకల్లి సూత్తా పొందుకుండ యీరాం.

"ఈడ గాలాం వుండాలి అగుపియదేం - సూడు దొబ్బునా-" అంటూ ఎర్రల గొబ్బిరిసిప్పకు దేవులాడ్తుండాడు ఎర్రాయి.

* * *

ఆ యీత పొదల సాటున సెరువు వొడ్డుకాడ ఎవరయినా పని పెట్టుకు పరీచ్చగా సూత్తేగాని గాలాంతో కూకుండ ఎర్రాయి అగుపియదు.

ముంగల పిల్లకాలవలకాడికి ఎల్లిన ఎఱ్రాయికి అంత దూరం ఎల్లినాకగాని ఎండలకు ఆడ నీలు యిలగర్సుకు పోయినట్టు తెల్చిరాలా. కాసినికూసిని మిగిలుండవొంట్రు నీలబురదల్లో దున్నకుఱ్రలు పొర్లాడాల్సిందే గాని బుద్ధిగల శాపలు పిల్లాజల్లాతో కాపరాలు సెయవని వాటి బతుకుతెరువులు తెల్చిన ఎఱ్రాయికి తెల్చు. కూడు దొరక్కబోతే ఎతుక్కుంటా ఎల్లే మద్సుల్లాగా, ఎసువంటెసువంటి శాపల కుటుంబాలు యిసువంటి పిల్లకాలవల కుండా అట్టట్ట ఆడనాగుల్సెరువుకు చేర్తయి గందా!

సెరువుకల్లి సూశాడు ఎఱ్రాయి ముక్కులాడిస్తా. అసువంటి కమ్మటోసన అసువంటిశాపలకే వుంటదిగందా! రుసిదెల్సిన ముక్కులు సెరువుకల్లి తోసుకుపోతావుంటే, బెదుర్తుండకళ్ళు ఏడేడ ఎసువంటి జనం ఎటెటుగా సూత్తావుండదీ కనిపెడ్తావుంటే – ఎల్లి సెరువువొడ్డున యీతపొదల సాటున కూసుండాడు ఎఱ్రాయి.

కదలక మెదలక వొక్కసారి సెరువుకల్లి కలియజూశాడు ఎఱ్రాయి. ఆడ సొరంగం అగుపిచ్చింది; ఎఱ్రాయికి ఆడే రతనాలుండయి, జిలేబీలుండయి, పొకోడీలుండయి, పొప్పుండలుండయి, గొబ్బిరిముక్కలుండయి, ముంతకజ్జాయం వుండది.

పిట్టా గిట్టా, గొడ్డుగోదా ఎండదెబ్బకు ఆవులించేయాల – యిళ్ళల్లో కుండల్లో కూకుని తపనబడ్తుండ వూరి జనానికి యీడ సొరంగంతో పనుండదని ఎఱ్రాయికి తెల్చు.

“ఎవుడా ఎదవ సెరువు పాటపాడేది? మోతాచ్చాయిబు పొళ్లాడ్తయి! గెడ్డం ఆడాల!”

“ఎంతన్యాయం! యిన్నేళ్ళనించీ యీ ఏనాదోళ్ళుగాదూ సెరువుపాట పాడ్తుండదీ? అయిదొందల యాభైయ్యయిదుకు పాట పెరుగుద్దా? యానాదోళ్ళను దెబ్బగొట్టాలనిగాని, పాట పెంచుతా పోతావుంటే ఎవడుమటుకేం పీక్కదింటాడూ? మొదలాపాట పాడిందెవుడంట? ఆడికేం దెల్చు శాపలెవారం? ఆటి వాసనేందెల్చు? అసలు ఎవడంట ఆట్ని బట్టేది? యీ ఏనాదోళ్ళగ్గాదూ ఆట్ని ఎట్టబట్టేది తెల్చిందీ?”

ఇసిరి లాగాడు గాలాన్ని ఎఱ్రాయి. దగదగ మెరిసి బోతా ఎగిరెగిరి పడింది గొబ్బిరిముక్కశాప.

“దా బయటికి రా” అన్నదా కంటం. జిలేబీలు, పొకోడీలు, పొప్పుండలు, గొబ్బరిముక్కలు, సెక్కిరాలు, ముంతకజ్జాయం అంతరిచ్చానికి లెగిసినై. బొక్కబోర్లా నీలల్లో పడిన నల్లగెడ్డాన్ని, తెల్లగుడ్డల్ని సూత్తావుండ ఎఱ్రాయిని ఆడీడ వొంటిమీన సరవదీసి జుట్టు బట్టుకు గెట్టిక్కిచ్చాడు మొతాచ్చాయిబు.

“క్యావ్‌రే బోసడీ?” కండల్దిరిగిన సేతులుండయి మోతాచ్చాయిబుకు.

"వూరకనేలే–" అన్నాడు ఎర్రాయి, యీపు కాసుకుంటూ.

"ఏ క్యావురే–"

"ఎహె వూరకనేలే–"

"ఎవుడి బాబు సొమ్మురే–"

"అదిగదిలే–"

"సాడే సౌపాంచ్‌రే–"

"జరం తగిల్తేనీ–"

"శాపల్, ముందరాబే–"

"వుక్–వుక్–"

"జావ్ బోసడీ – ఏది – ఏమన్నా వుండయ్యా"

* * *

"ఏవఁన్నా పడ్డయ్యా?" అని యిశారిచ్చింది యీరాం.

"ఏంది పడేది – అరవమాక –" అన్నాడు ఎర్రాయి గాలాం మూలబారేసి కూకుంటా.

"అరవమాకా? మరి యాడకి నువు గాలాందీసుకునెల్లిందీ?"

"ఎల్తే ఏంలే–"

"ఎల్తే ఏంలే! యిదిగో నయ్యోవ్, కాలీసేతులాడిచ్చుకుంటా నువుగాంగా వొచ్చావుగానీ; ఆ సీతమ్మగోరూ, లచ్చుమ్మగోరూ పైనెలజీతంలో రాబట్టుకోమని పావలాబిల్ల అడిగితేనీ సేతులాడిచ్చుకుంటా మీనమీన కొచ్చారు. మరికూడు యాణ్నుంచి వొచ్చుద్దో ఆమీన నీయిట్టమయ్యా"

"ఇంతకన్న సెడేదేం వుండదే! యియ్యాలేం కొత్తగాదుగా మనకీ!"

"అయితే తత్వాలు పాడుకుంటా సావమనా నువనేదీ?"

"ఇన్నాలమించీ సచ్చావంటే – పొళ్ళాడదన్నంఁద్రా!"

"వూడదందువులే కడుమ్మాడ్సిసంపుతూ, మొగుడంటే యిట్టనే వుండాలంటాడు గావాల్ను బెమ్మదేవుడు!"

"ఒచేవ్ పెల్లావంటే కాడికిమల్లే కరుసుక్కూకుండేదంటే?"

"మరెందుగ్గట్టుకోవాల నన్నూ?"

"ఎవురు, నేనా? నువుకట్టుకోలేదంటే నన్నూ?"

"మా అయ్య కట్టుకోమంటే కట్టుకున్నా"

"అయితే నీకు మొగుడక్కర్లేదంటే?"

"ఆఁ అదెట్టా - సాల్లేవూర్కో!"

"ఇదిగో, మొగోడి రందిలేని వొక్క ఆడగూతుర్ని యీ బెమ్మాండం మొత్తమ్మీన సీపిచ్చూ, నీకాలికింద దూరకబోతే అప్పుడను."

"మొగోడికే వుండది ఆదరంది.'

"ఇద్దరికీ వుండదన్నాదంటే?"

"అదేమో - కూడుబెట్టని మొగాడేం మొగుడంటా?"

"నీకు పెట్టకుండా నేనే పీక్కదింటన్నానంటావ్?"

"మొదలుంటేగా ఆడా?"

"కల్చిరాకబోతే ఎన్నయినా అంటావులేయే-"

"నేనేం అన్లా అన్నిన్నీ."

"మరేందే నీయాటా?"

"నేనేం ఆట్టల్లా - ఎగరమాక-"

"బొంబిడాయి మొగాలుంటయ్యే-"

"నీకుండలా పీతమొగం-"

"కొప్పూదుద్ది-"

"మొగోడు గాలాందీసుకు బయలెల్లాడు తెల్లారంగానే!"

"అది గందుగ్గదంటే నువు యిందాకట్నుంచీ రాగాల్దీత్తుండదీ? నాకు తెలదంటే నీతంతూ? ఆ, నే ఎదవనే అనుకో; ఏపనికీ శాతగాని నక్కోరు పచ్చినే అనుకో - యిగ సరేనా?"

"ఏందయ్యా అంతలావుమాటలు రానిత్తావ్? శాపలు పట్టుకొత్తావని యీ వర్దాకా కూకుని కూకుని సోసొత్తావుంటే ఎందుకయ్య అట్ట మీన మీన కొత్తావ్? పడిలేసినోడివి నీకు మటుకు తెలవదంటయ్యా కదుమ్మంటా? ఏవో, యాడేం దిన్నావో ఎవురికేం దెల్చుద్ది! అందుకే గావాల్ను వొచ్చినేల్నుంచీ కసురుకుంటా కూకుండావు. అసలెందుకులే మొదులీ పెళ్ళాం పచ్చంటేనే నీకు రోతపుద్దుండె- పానీలే - యింకెన్నాలుంటది-"

"చెప్పుదీసుకు తన్ను దొంగగెడ్డి తిన్నోణ్ణి, పొలుగు దిగెయి జూటా కోరయితే"

"ఇగ దేనికిలే–"

"అట్టనమాకే– యిదిగో, యీ ఎఱ్ఱాయంటే యింతేనంటే తెల్సిందీ–"

"దెగ్గిరికి రామాక–యాడకి అట్టా జరుగుతావ్–"

"జరగన్లే, సెర్లో శాపలు పొట్టుకోనీయటంలా మోతాచ్చాయిబు–"

"ఆడి మొదులార–"

"నాలుగు పీకుదునుగానీ– రూలట్టుందని–"

"ఈడి జిమ్మడా, రూలేందీ – మునిసీబుకు ఈదుగాదూ తార్చేదీ?"

"మొదులు యీఏటి సెరువుపాట మనోళ్ళకి దక్కనీకుండా సేశారు గదంటే?"

"అయ్యో బగమంతుడా, యాపారం యిటుగా మల్లుతుండది గావాల్ను!"

"అసలాడ నీకూ నాకూ తెలవని వలేసే మొగోడెవడుండాడే?"

"సెనేశరం పట్టుద్దిలే!"

"శాన్సు సూడంది వొదుల్తాగా–"

"కాత్తె దెగ్గిరికి రా..."

* * *

"ఎంకాయ్?"

"ఏందిరెఱ్రాయ్? కాత్తె వుసులుగుండదా?"

"ఇన్నావంట్ర ఎంకాయ్? సెరువుపాట తన్ని కెల్లాఱ్రా."

"ఇనకుండా ఎట్టుంటాంరా ఎఱ్రాయ్. అంజియ్య జేశాఢ్రా యిదంతా."

"ఎవురు బెమ్మయ్య బామ్మరిది అంజియ్యా?"

"ఆఁ ఆ పెద్దమద్దే. సెక్రం దిప్పినట్టు తిప్పాదుగా పాటనీ! యిన్నాల మించి సెరువుజోలికి పోలా యీ పెద్దమద్దులు."

"మునిసీ బేమన్నాడూ?"

"మొదులు యవారం యీవజాన తిరగనే తిరగ్గూడ్దుగాని మునిసీబేం జేత్తాడు ఆరారంతా వొకటయితే!"

"నేనుండక బోతినాద–"

"ఓరీపోరా నువు నేనేంది పెద్దోడు పోలిమావేఁ ఆవజాన కూలిపోతేనీ!"

“ఇగ ఎట్టారా బతికేదీ?”

“ఎట్టనేం వుండదీ, రాలుదిని బతకాల్చిందే – ఆటికీ యాపారం తగలకుంటే.”

“కడుపుడుకుతుండది.”

“మెల్లిగంటావేం?”

“మోతాచ్చాయిబు కొట్టాడ్రా ఎంకాయ్. యీరావుకు తెలుత్తే ఏడ్చుద్ది.”

“ఆఁ–”

“పిల్లకాలవలు అప్పుడే ఎందుకు బోతయ్యని నాకేం దెల్చుద్దీ? మద్దానం యిట్టబొయిసూత్తే యిగనేం వుంటది వొంట్రు బెత్తెలు దప్పా. ఆమైన ఆయీత పొదలకాడికి సూసొద్దామని యిట్టబొయినా – యిగనేం వుండది ఎనికీడ్తే వొచ్చి పెడీపెడీమంటా అదేమోయిన బాదాడు.”

“ఎవురు, గెడ్డంవోడు?”

“ఆడె యదవ.”

“ఆణ్ణోకంట కనిబెట్టాల్చిందే...”

“ఏవఁన్నా ఓ పావల్డబ్బులుంటయ్యంట్రా ఎంకాయ్?”

“మన చంగతి నీకుతెలవందేం వుండదిరా ఎర్రాయ్?”

“అంతేలేరా ఎంకాయ్.”

“సెన్దగులుకుందిలేరా ఎర్రాయ్.”

“బీడిముక్కుండదా?”

“ఎట్టరా ఎర్రాయ్. యింతకు ముంగలే చివయ్య ఓముక్క బారేత్తే కాల్చేత్తినే!”

“దానెమ్మ పానీలే.”

“కుతి గదంట్రా.”

“ఎంకాయ్?”

“ఏందిరెర్రాయ్?”

“నీకాడ పెద్దవల వుండదిగదంట్రా?”

“వుండదిగా!”

“ఏంలేదుగానీ రాత్తిరికి ఓకోపేవన్నా కాత్తావా?”

“తల్మొండమొయ కాయాల్సిందే!”

"పులిగాడేవన్నా సెయి గలుపుతాడంట్రా?"

"ఆ డెప్పుడా అని రెడీగుంటాడు."

"రేత్తిరికి?"

"రేత్తిరికి."

* * *

నిశిరేత్తిరి కారుసీకటీ. ఏడ ఎవురుండదీ అగుపియరు. నచ్చింత్రాలు సెరువు నీలల్లో మెరుత్తుండయి. సీకటి సల్లగా సూసుకుని యవదానం దొరికిందంటా ఎగిరెగిరి పద్తుండయి బల్చిన శాప్పిల్లలు. ఎండ దెబ్బతిన్న వూరిజనం పానాలు సొమ్మసిల్లి ఎప్పుడో పొందుకుండై. అడుక్కుదినేవోళ్ళు యీదులెంట అగుపియబొయ్యేతలికి తోకముడుసుకు అప్పుడే పొందుకుండై సుండోళ్లకుక్కలు. అసువంటి నిసిరేత్తిర్న యాడమటుకు ఎవురికేం పనుంటది?"

నాగుల్చెరువు దచ్చినపు దిక్కున నాగజెవుండు పొదలమాటున మూడు యిగ్రహోలు కూకుని నిక్కి నిక్కి సూత్తుండయి మినుకు మినుకంటుండ కళ్ళతో.

"ఎంకాయ్?"

"ఏందిరెర్రాయ్?"

"పులిగా?"

"ఏందిరెర్రాయ్?"

"కూసేపు సూద్దాం" అన్నాడు ఎర్రాయి.

"సూత్తేనే నయం."

"యెందుకయినా మంచిది."

"సూద్దావంటారా?" అన్నాడు ఎర్రాయ్ ఒక్కచనం ఆగి.

"సూసేదేంది సప్పగా యాడజనం ఆడ పొందుకునైపోతే?"

"ఈడ కినిపిత్తుంటే గురకలు?"

"ఆరికేం మారాజులు!" అన్నాడు ఎర్రాయ్.

"గడిసినోడల్లా మారాజే?"

"బలే మాటన్నావులే!"

"మరదేందో మనకి గడవకుండా వుండది" అన్నాడు ఎర్రాయి.

"గడుత్తే యీా పన్దేనికీ?"

"గడవటవేఁ వుంటే యిసువంటి బొంబిడాయిలు ఎన్నొచ్చి నోటిముంగల కూకుండా వుమ్ముతా."

"మన అయ్యోళ్లు యిసువంటి బతుకు బతకలేదనిపిచ్చుద్ది" అన్నాడు ఎర్రాయి.

"శాపలుదిన్నా పట్టపగలు తిని బతికారు."

"ఒక్క ఎదవా కిక్కురుమన్లేదుగావాఁల్ను!"

"అంజియ్య ఆరోజుల్లో శాపలేపారం పెట్టలేదుగా?" అన్నాడు ఎర్రాయి.

"మనోళ్ళు బొమ్మలాటాడ్తే యాడజనం ఆడ నోళ్ళు దెర్సుకు సూసేవోరు!"

"బాగోతం ఆడ్తేనో?"

"తలా బత్తా గింజలిచ్చేవోరు- యిప్పుడెవుడంట మనకల్లి సూసేది?" అన్నాడు ఎర్రాయి.

"చినిమాలొచ్చి కూకుండెగా?"

"గాసులైటు నాటకాలు రుసిగుండే!"

"ఓరిపోంద్రా, ఆట్ని మనోళ్ళు ఆఁవళ్లలెక్క నడిసి సూసిరాటంలేదంట్రా!" అన్నాడు ఎర్రాయి.

"ఆ మాటకొస్తే నిజమంతేలే."

"అవుననుకో."

"ఇంతకీ రోజులు మార్తుండయిలే, మరి మనసంగతి సూడబోతే ఎనిక్కెనిక్కిబోతా వుండె" అన్నాడు ఎర్రాయి.

"ఎనిక్కేంది డొక్క పీక్కుబోతావుంటే?"

"పడమర పక్క నుండ మా మరదలోళ్ళు బురద నీలు దాగి సచ్చారు."

"రేపో మాపో మనపనీ అట్టవదని గ్యారంట్రీఏందంట" అన్నాడు ఎర్రాయి.

"ఇగ సత్తేనే గ్యారంట్రీ!"

"సొరగంలో గ్యారంట్రే బొహుకమ్మగుంటుందంటలే"

"సత్తే యీా సెర్లోనన్నా పడిసావాల్సిందేగాని ఏందంటా నాసిబతుకు?" అన్నాడు ఎర్రాయి.

"ఏహె దిగండి సూత్తారేం?"

"తియరేందిరా వలా, యాల మిగిలిపోతుంటే."

"మోతాచ్చాయిబు గెడ్డం పీక్కుదినాల్చిందే" అన్నాడు ఎర్రాయి గెంతేసి నిలబడ్తా.

"సాయిబుకూ జై."

"అంజియకూ తొయ్- ఏందదీ-"

"ఎవుడో వొత్తుండాడ్రా-"

"సచ్చాంరా బగమంతడా-"

"డొంకలోకి- లగెయ్-"

"అమ్మ మోతాచ్చాయిబురో రెంకాయ్-"

"లగెయ్ లగెయ్- డొంక- డొంకా-"

దబదబా, గబగబా, టపటపా కాళ్ళు కొట్టుకుంటా వొచ్చి నిలబడిందా యిగ్రహం.

"అరె తేరేమాకీ- యెవుడ్రా బోసడీ- కడోరే సువర్" అన్నదా యిగ్రహం ఎంటికలు కొరుకుతా.

వుసిగలిపిన సుండోళ్ళకుక్క లగెత్తినట్టు లగెత్తిన లగెత్తటం, గుమ్మం కాడికొచ్చి గుమ్మంలో కూకుండ యీరావుఁను సూసేతలికి, యెగశాసతో గుండె రోజాపొట్టు పట్టినట్టయింది ఎర్రాయికి......

**('సమీక్ష'లో ప్రచురణ)**